క్లుప్తంగా

తాగునీటి సమస్యకు పరిష్కారం



నూతనంగా ఏర్పాటు చేసిన కుళాయిలు

సారవకోట: మండల కేంద్రంలోని అంబేడ్కర్ కాలనీకి తాగునీటి సమస్య తీరింది. రక్షిత మంచి నీటి పథకం నుంచి తాగునీటి సరఫరా కావడంలేదని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడుల దృష్టికి సర్పంచ్ శంకరరావు, ఎంపీటీసీ గుణుపురం రామారావు తీసుకెళ్లారు. మండల పరిషత్ నిధులు కేటాయించి ఇటీవల బోరు తవ్వించి దానికి మోటార్ ఏర్పాటు చేసి తాగునీటి సరఫరా చేపట్టారు.

విశ్వహిందూ పరిషత్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు

నరసన్నపేట: గ్రామ స్థాయిల్లో సమితులు ఏర్పాటు చేసి హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర మఠమందిర ప్రముఖ్ సింహాద్రి ఫల్గుణరావు అన్నారు. స్థానిక అయ్యప్ప స్వామి ఆలయంలో ఆదివారం విశ్వ హిందూ పరిషత్, భజరంగదళ్, దుర్గావాహిణీ కమిటీ ప్రతినిధులు సమావేశం నిర్వహించారు. దీంట్లో పాల్గొన్న ఫల్గుణరావు మాట్లాడుతూ బలవంతపు మతమార్పిడులు, గో అక్రమ రవాణాను అరికట్టాలని అన్నారు. ప్రతీ గ్రామంలో కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. విశ్వహిందూ పరిషత్ క్యాలండర్‌ను ఆవిష్కరించారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అప్పారావు



అప్పారావు

కొత్తూరు: కొత్తూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు బార్ అసోసియేషన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నూతన అధ్యక్షుడు ఎం.అప్పారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యక్షుడిగా సీహెచ్ రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా వి.సుధాకరరావు, సహాయ కార్యదర్శిగా ఆర్.ఉమామహేశ్వరరావు, కోశాధికారిగా రాడ రాజుతో పాటు కార్యవర్గ సభ్యులిగా మరో ఐదుగురుని ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. కోర్టు భవనం నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించాలని కోరారు. ఐదేళ్ల నుంచి రెగ్యులర్ జడ్జి నియామకం లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నామన్నారు.

సాహిత్యంతో సమాజ అభ్యుదయం



మాట్లాడుతున్న విశ్రాంత రీడర్ చంద్రశేఖర్

పొందూరు: నిత్య జీవితంలో సాహిత్యం ఉపయోగపడాలని, భాష, సంస్కృతులు కొనసాగడాని సాహిత్యం అవసరమని విశ్రాంత రీడర్ ఆట్ల చంద్రశేఖర్, ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భానుమూర్తి అన్నారు. స్థానిక ఒకటో నంబర్ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం నిర్వహించిన జనసాహితి ప్రాంతీయ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సమాజ అభ్యుదయానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజలు కాంక్షించాలన్నారు. సంక్షోభ పరిస్థితులను అధిగమించేలా సాహిత్యం దోహదం చేస్తుందన్నారు. సాహిత్యం సమాజ హితానికి ఎంతో పాటుపడుతుందన్నారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఎ.విజయకుమార్, జనసాహిత జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్‌రావు, సభ్యులు తిరుమలరావు, ఉపాధ్యాయులు ఎం.రమణరావు, శ్రీనివాస్, నవీన్‌కుమార్, కె.వెంకటరావు, జవహర్ గుప్త, బోగిరాజు తదితరులు పాల్గొన్నారు.

మిషన్ వాత్సల్యకు దరఖాస్తుల ఆహ్వానం

ఎల్.ఎన్.పేట: అనాథ పిల్లలకు అండగా ఐసీడీఎస్ నిలుస్తుందని లక్ష్మీనర్సుపేట సెక్టార్ సూపర్‌వైజర్ ముగడ నవభారతి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మిషన్ వాత్సల్య పథకం ద్వారా పేదలైన వారిని అదుకునేందుకు ప్రభుత్వం ఐసీడీఎస్ ద్వారా అవకాశాలు కల్పిస్తుందన్నారు. తల్లి, తండ్రి లేని, అనాథ అశ్రమంలో ఉన్నవారికి, దివ్యాంగులు, హెచ్ఐవీ, క్యాన్సర్ వంటి పలు రకాల ప్రాణాంతకమైన వ్యాధితో బాధపడే పిల్లలు మిషన్ వాత్సల్య పథకంలో ఈ నెల 5వ తేదీలోగా ఆమదాలవలస ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. సంబంధిత ధ్రువపత్రాలతోపాటు ఆదాయ ధ్రువపత్రం (వార్షిక ఆదాయం రూ.72 వేల లోపు ఉండాలి) తో దరఖాస్తు చేసుకోవాలన్నారు. గ్రామాల్లో ఇలాంటి వారు ఉంటే వారి ద్వారా దరఖాస్తులు చేసేలా అంగన్‌వాడీ కార్యకర్తలు చూడాలన్నారు.

రబీ పంట పండింది



సారవకోట మండలంలో ఈ ఏడాది రబీలో వరి సాగు చేసిన రైతులకు పంట చేతికొచ్చింది. రంగసాగరంలో నీరు అడగంటి పోవడంతో చుట్టు పక్కలున్న చెరువులలో నీటిని పంటకు పెట్టారు. అయినప్పటికీ పంటపై రైతులు ఆశలు వదులుకున్న సమయంలో వర్షాలు కురవడంతో పంట పండింది. ఎకరాకు 40 బస్తాలు వరకు దిగుబడి వచ్చిందని రైతులు చెబుతున్నారు.

\- సారవకోట

విష్ణు సహస్రనామ పారాయణం

పొందూరు మండలంలోని లైదాం గ్రామంలో శివానంద ధర్మక్షేత్రంలో రామలీలా కల్యాణ మహోత్సవాలు, సీతారామ మహోయజ్ఞం వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగం ఆదివారం చుట్టు ప్రక్కల గ్రామాలకు చెందిన విద్యార్థులతో కోటి విష్ణు సహస్రనామ పారాయణం చేయించారు. సూర్య నమస్కారాలు, రాహుకేతు పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. లైదాం, తుంగపేట, పొందూరు, రాపాక, సంతకవిటి తదితర గ్రామాల నుంచి భక్తులు పాల్గొన్నారు.

\- పొందూరు



బిజీ..బిజీ..



పొలంలో సేంద్రియ గత్తం వేసే పనుల్లో ఎల్.ఎన్.పేట మండలంలోని పలు గ్రామాలోలని రైతులు బిజీగా ఉన్నారు. ఏడాదంతా పెంటల్లో కుళ్లిన గత్తాన్ని నాటుబండ్లతో పొలంలో వేస్తున్నారు. సేంద్రియ గత్తం వేయటం వల్ల.. రసాయన ఎరువుల వినియోగం, ఖర్చు తగ్గుతుందని రైతులు భావిస్తున్నారు. మండలంలోని కృష్ణాపురం, తురకపేట, బొత్తాడసింగి, జాడుపేట, యంబరాం, పూశాం, రావిచెంద్రి, కుశమలపాడు, డొంకలబడవంజ తదితర గ్రామాలకు చెందిన రైతులు గత కొద్దిరోజులుగా గత్తాన్ని పొలాల్లో వేస్తున్నారు.

\- ఎల్.ఎన్.పేట

రైతు పక్షపాతి సీఎం జగన్



కొత్తూరులో రైతు విత్తన నిల్వ కేంద్రానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- రైతుల కలెక్షన్ సెంటర్‌ను వినియోగించుకోవాలి
- పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



మహసింగి కాలనీలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

కొత్తూరు: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే రెడ్డి శాంతి పాల్గొన్నారు. కొత్తూరులో రూ.15 లక్షల అంచనా విలువతే నిర్మించనున్న రైతు కలెక్షన్ సెంటర్‌ను ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పండించిన పంటలను ఈ కలెక్షన్ సెంటర్‌కు తీసుకువచ్చి గిట్టుబాటు ధర వచ్చినంత వరకు దాచుకోవచ్చున్నారు. ఇటువంటి కలెక్షన్ సెంటర్లతోపాటు అనేక కార్యక్రమాలను అమలు చేసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిర్మించి రైతు పక్షపాతిగా నిలుస్తున్నారన్నారు.

తాగునీటి ట్యాంకు ప్రారంభం..

మండలంలోని కుంటిభద్ర కాలనీలో తాగునీటి ట్యాంకును ఎమ్మెల్యే ప్రారంభించారు. దశల వారిగా ప్రతి ఇంటికీ కుళాయి ఏర్పాటు చేస్తామన్నారు. ఇదే కాలనీలో సామాజిక భవనం నిర్మాణానికి భూమి పూజ చేశారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ...

మండలంలోని మహసింగి కాలనీలో జి.వరప్రసాదరావు ఏర్పాటు చేసిన బీ.ఆర్.అంబేడ్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. మహిళల అభ్యున్నతికి అంబేడ్కర్ చేసిన కృషిని వివరించారు. ఇటువంటి ఆదర్శమూర్తిల విగ్రహాలు ఏర్పాటు చేయడం ఎంతో శుభపరిణామమన్నారు. అనంతరం అన్నప్రసాద కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈటీపీఆర్డీ కృష్ణారావు, ఏపీఎం త్రినాథమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు, జెడ్పీటీసీ కామక భాగ్యవతి, పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, వైస్సార్‌సీపీ నాయకులు బూర్లె శ్రీనివాసరావు, ఎం.చక్రపాణి, గోగుల వరప్రసాదరావు, కామక త్రినాథరావు, పడాల లక్ష్మణరావు, లోతుగెడ్డ తిరుపతిరావు, లోతుగెడ్డ భగవాన్‌దాసు నాయుడు, అంబేడ్కర్ సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఐదు కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు



నరసన్నపేట: ఉర్లాం స్కూల్లో బెంచీలపై నంబర్లు వేస్తున్న సిబ్బంది

నరసన్నపేట: మండలంలో సోమవారం నుంచి ఐదు కేంద్రాల్లో పదో తరగతి పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. 1,215 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. అందరికీ అవసరమైన సామాగ్రి సమకూర్చారు. రవీంద్రభారతి పరీక్ష కేంద్రంలో 208 మంది, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 190 మంది, నారాయణ స్కూల్‌లో 267 మంది,సెయింట్‌క్లారెట్ స్కూల్‌లో 299 మంది, ఉర్లాం ప్రభుత్వ పాఠశాలలో 133 మంది విద్యార్థులను కేటాయించారు. మండలంలో సుందరాపురం స్కూల్ విద్యార్థులు 26 మందిని జలుమూరు మండలం తిమడాంలో, మాకివలస స్కూల్ విద్యార్థులు 38 మంది పోలాకి మండలం ఏపీ మోడల్ స్కూల్ ఈదులవలసలో, మడపాం విద్యార్థులు 42 మంది సింగుపురంలో పరీక్షలు రాయనున్నారు. ఉర్లాం స్కూల్ విద్యార్థులు 84 మంది సెల్ఫ్ సెంటర్లో పరీక్షలు రాస్తుండగా.. ఇదే సెంటర్లో బాడాం విద్యార్థులు 22 మంది, లుకలాం విద్యార్థులు 27 మంది పరీక్షలు రాయనున్నారు. బొరిగివలస స్కూల్ విద్యార్థులు 35 మంది, కంబకాయ విద్యార్థులు 41 మంది, సత్యవరం స్కూల్ విద్యార్థులు 36 మంది, బోర్దు స్కూల్ విద్యార్థులు 129 మంది, ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు 135 మంది జంబ్లింగ్ పద్ధతిలో పరీక్షలు రాయనున్నట్లు ఎంఈఓ శాంతారావు తెలిపారు.

మూడు కేంద్రాల్లో..

బూర్జ: మండలంలోని మూడు పరీక్ష కేంద్రాల్లో 572 మంది పదో తరగతి విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని ఎంఈఓ ఎస్. రామకృష్ణ తెలిపారు. బూర్జ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 140, కొల్లివలస డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ గురుకులంలో (ఏపీఎస్‌డబ్ల్యూఆర్ స్కూల్) 150, ఓ.వి.పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 280 మంది విద్యార్థులు రాస్తారన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



మండల వీధిలో పర్యటిస్తున్న తమ్మినేని చిరంజీవినాగ్

ఆమదాలవలస: మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లోనూ సమస్యలు పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ అన్నారు. 10వ వార్డు మెట్టక్కవలస ప్రాంతంలోని మండల వీధిలో ఆదివారం ఉదయం పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తాగునీరు సరిగా రావడంలేదని, డ్రైనేజీలు బాగులేవని, తదితర సమస్యలను ఆయన దృష్టికి ప్రజలు తీసుకువచ్చారు. అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. మున్సిపల్ కమిషనర్ కె.అప్పలనాయుడు, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్‌కుమార్, వార్డు సచివాలయ కోఆర్డినేటర్ అల్లం శెట్టి ఉమామహేశ్వరరావు, పార్టీ నాయకులు కె.రామకృష్ణ, విజయ్, బిట్టు తదితరులు పాల్గొన్నారు.

ఒడియా బ్రాహ్మణులను బీసీ జాబితాలో చేర్చాలి



హాజరైన ఒడియా బ్రాహ్మణ సంక్షేమ సంఘం ప్రతినిధులు

నరసన్నపేట: ఆంధ్రప్రదేశ్‌లో నివసిస్తున్న ఒడియా బ్రాహ్మణులను బీసీ జాబితాలో చేర్చాలని ఒడియా బ్రాహ్మణ సంక్షేమ సంఘం ప్రతినిధులు సురేష్ పండా, సత్యన్నారాయణ పాడి విజ్ఞప్తి చేశారు. నరసన్నపేట మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యులు రమణసాహు ఆధ్వర్యంలో ఒడియా బ్రాహ్మణ సంఘం ప్రతినిధుల స్థానిక కల్యాణ మందిరంలో ఆదివారం సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా సురేష్ పండా, సత్యన్నారాయణ పాడి మాట్లాడుతూ.. ప్రస్తుతం ఓసీ జాబితాలో ఉన్న బ్రాహ్మణుల్లో 80 శాతం మంది పేదలేనన్నారు. ప్రభుత్వం పరిశీలించి బీసీ జాబితాలో చేర్చి సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. ఈ మేరకు రాష్ట్ర మంత్రులు, అధికారులను కలిసి వినతి పత్రాలు అందజేయాలని నిర్ణయించారు. నియోజకవర్గాలు, జిల్లాలు వారిగా కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. ఇచ్ఛాపురం, టెక్కలి, శ్రీకాకుళం, నరసన్నపేట, ఆమదాలవలస, కోటబొమ్మాళి, గార, పలాసతోపాటు పలు గ్రామాల నుంచి సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు రమేష్

పొందూరు: మండలంలోని వీ.ఆర్.గూడెం పరిధిలోని కొండపై మూడు రోజుల క్రితం అక్రమ గ్రావెల్ క్వారీలో విద్యార్థి మృతి ప్రమాదం కాదని, అది హత్య అని వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు పప్పల రమేష్ కుమార్, జెడ్పీటీసీ లోలుగు కాంతారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకర్లతో ఆదివారం మాట్లాడారు. తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకులే ఈ అక్రమ క్వారీలు నిర్వహిస్తున్నారన్నారు. ఎంతో మంచి భవిష్యత్ ఉన్న విద్యార్థి బగాది మణికంఠ ప్రాణాలు కోల్పోయాడన్నారు. మరణానికి ఒక రోజు ముందు విద్యార్థి అక్రమ క్వారీ గుట్టురట్టు చేస్తానని అనడంతోనే పథకం ప్రకారం హత్య చేశారని ఆరోపించారు. విద్యార్థి మృతికి ఎస్.మధు, సి.హెచ్.శ్రీనివాసరావు ఉన్నారన్నారు. పోలీసులు ఒక్క ఎస్.మధు పేరును మాత్రమే వెల్లడించారని, శ్రీనివాసరావు పేరు ఎందుకు బయట పెట్టలేదని ప్రశ్నించారు. ప్రమాదానికి సమీపంలోనే భవాని క్రషర్ ఉందని, ఆ నిర్వాహకులు ఎవరని ప్రశ్నించారు. భారీ స్థాయిలో అక్రమ క్వారీలు జరుగుతుంటే పోలీసు, రెవెన్యూ, మైనింగ్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. ప్రమాదం జరిగిన మూడు రోజులకు మైనింగ్ అధికారులు రావడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ప్రమాదానికి కారణమైన వారందరిపై కఠిన చర్యలు తీసుకోకపోతే పొందూరు పోలీస్ స్టేషన్, మైనింగ్ కార్యాలయాలను ముట్టడిస్తామన్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. సర్పంచ్ రేగిడి లక్ష్మి, ఏఎంసీ చైర్మన్ బాడాన సునీల్, పార్టీ నాయకులు గుడ్ల మోహన్, జి.నాగరాజు తదితరులు ఉన్నారు.

విద్యార్థుల ప్రతిభ



విజేతలకు సర్టిఫికెట్లు, మెమెంటోలు అందజేస్తున్న ఎంఈఓ మణికుమార్

పాతపట్నం: ఏపీ ఒడియా ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మేధా సమ్మాన్ టెస్ట్‌లో (మండల స్థాయి) ముగ్గురు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని ఎంఈఓ సీహెచ్ మణికుమార్ తెలిపారు. మండలంలోని బూరగాం ఒడియా యూపీ పాఠశాలలో ఏపీ ఒడియా ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు విశ్వనాథ్ బరొడా, ఏపీఓటీ ప్రధాన కార్యదర్శి ప్రహల్లాద పుల్లాయ్ పర్యవేక్షణలో ఆదివారం ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఒడియా మాధ్యంలో మేధా సమ్మాన్ టెస్ట్ నిర్వహించారు. పాతపట్నం ఒడియా ఎంపీపీఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థి సుభాశ్రీ పాత్రో ప్రథమ , చిన్నలొగిడి ఎంపీపీఎస్ పాఠశాలకు చెందిన చంద్రో సోయి ద్వితీయ, రుణి మహోపాత్రో తృతీయ స్థానాలు సాధించారన్నారు. 2022లో పదో తరగతిలో పాతపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన లిమేశ్వరీ మండలంలో మొదటి స్థానం సాధించడంతో సత్కరించారు. ఉపాధ్యాయులు భీమ్‌సెన్ పండా, గణేష్ బరోడా, ఎ.జనార్ధనరావు, సురేంద్రపాడీ, హరి బిశ్వాల్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు నమ్మక ద్రోహి



చంద్రబాబు, లోకేష్‌ల దిష్టి బొమ్మలను దహనం చేస్తున్న గిరిజన నాయకులు

మెళియాపుట్టి: తెలుగుదేశం నేతలు 2017లోనే బోయ, వాల్మీకిలను గిరిజనుల్లో చేర్చాలని తీర్మానం చేశారని, అప్పుడే గిరిజనులను తొక్కేయడానికి భీజం వేశారని ఆదివాసీల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వరహాల కృష్ణారావు అన్నారు. మండలంలోని పెద్దమడి గ్రామంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, లోకేష్ దిష్టి బొమ్మలను ఆదివారం దహనం చేశారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ సత్యసాయి జిల్లాలో జరుగుతున్న పాదయాత్రలో లోకేష్ చేసిన వ్యాఖ్యలు బాధాకరమన్నారు. బోయ, వాల్మీకిలు తెలుగుదేశం కుటుంబ సభ్యులు అని, అప్పట్లోనే వారిని ఎస్టీ జాబితాలో చేర్చడానికి తీర్మానించామనే వ్యాఖ్యలను చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గిరిజన గ్రామాలకు లోకేష్ పాదయాత్ర వస్తే అడ్డుకుంటామని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రంలోని ఆదివాసీలంతా ఏకమై గత ఎన్నికల సమయంలో తెలుగుదేశం ప్రభుత్వాన్ని గద్దెదించినా బుద్ధిరాలేదా అని ప్రశ్నించారు. గిరిజనులపై ఇటువంటి వ్యాఖ్యలు చేయడం మానుకోవాలన్నారు. లక్ష్మీపురం కిరణ్, రాజు, సవర దాలయ్య, సవర రమేష్, రవి, జగన్ తదితరులు పాల్గొన్నారు.

నీలమణిదుర్గ ఉత్సవాలపై అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీలో పాల్గొన్న గ్రామస్తులు

పాతపట్నం: ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవం పాతపట్నం నీలమణిదుర్గ అమ్మవారి ఉత్సవాలు మే 21 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రధాన ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం గ్రామ పెద్దలు అవగాహన ర్యాలీ నిర్వహించారు. నీలమణిదుర్గ ఆలయానికి గ్రామస్తులు చేరుకుని అక్కడ నుంచి ప్రధాన రోడ్డు మీదుగా కోర్టు కూడలి, ఆల్‌ఆంధ్ర రోడ్డు కూడలి, మార్కెట్ మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ర్యాలీ చేపట్టారు. బీసీ కమ్యూనిటీహాల్‌లో ఆదివారం ఉదయం ప్రధాన కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. పూజా కమిటీ, శానిటేషన్, శాంతిభద్రల నిర్వహణ తదితర కమిటీలు ప్రధాన కమిటీకి అనుబంధంగా పనిచేయాలన్నారు. గ్రామ పెద్దలు లింగాల మధుబాబు, కళ్ల రాజు, లింగాల రవికుమార్, పైల లక్ష్మయ్య, శిర్ల జోగారావు, పైల బాబ్జి, సవిరిగాన ప్రదీప్, పెద్దింటి మోహన్‌దాస్, శాసనపూరి మధుబాబు, కొండాల యరకయ్య, మల్లికార్జునరావు, నూలు ఈశ్వరరావు, పెద్దింటి అప్పారావు, నూలు బుజ్జి, రెగెటి షణ్ముఖరావు, పోలాకి నరేష్, నేతాజీ, కనకాల కర్రన్న పాల్గొన్నారు.

సాహితీ బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



సాహితీ బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి ధర్మాన, తదితరులు

శ్రీకాకుళం కల్చరల్: సాహిత్యాభివృద్ధిలో శ్రీశ్రీ కళావేదిక సేవలు అభినందనీయమని మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. తిరుపతిలో జరగనున్న సాహితీ బ్రహ్మోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం రణస్థలంలో మంత్రి ధర్మాన, ఎమ్మెల్యే కిరణ్, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ఆవిష్కరించారు. మహిళా పోలీసుగా విధులు నిర్వహిస్తూ సాహిత్యంపై మక్కువతో రచనలు చేస్తున్న శ్రీశ్రీ కళావేదిక మీడియా ప్రతినిధి బమ్మిడి అమ్మోజీని అభినందించారు. మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించడం శుభపరిణామమన్నారు. అనంతరం అమ్మోజీ మాట్లాడుతూ శ్రీశ్రీ కళావేదిక, ఇంద్రాణి చారిటబుల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 9, 10, 11వ తేదీల్లో సాహితీ బ్రహ్మోత్సవాలు జరుగుతాయని చెప్పారు. ఇప్పటికే 2వేల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. కళాకారులందరికీ ఉచితంగా వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ పి.రజనీసాయికుమార్, జెడ్పీటీసీ టి.సీతారాం, ఎంపీడీఓ ధనుంజయరావు, ఎస్సై రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న జిల్లా ఉపాధ్యక్షుడు రామ్‌ప్రసాద్

ఆమదాలవలస రూరల్: సమాచార హక్కు చట్టం ఉపయోగించి అవినీతిని నిర్మూలించవచ్చునని సమాచార హక్కు చట్టం రక్షణ వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు డి.రామ్‌ప్రసాద్ అన్నారు. మండలంలోని చిట్టివలస గ్రామంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సును ఆదివారం నిర్వహించారు. అవినీతి నిర్మూలనలో యువత పాత్ర ఎంతో కీలకమైనదని, సమాచార హక్కు చట్టం వజ్రాయుధం వంటిదని, దీనిని వినియోగించి ప్రభుత్వ కార్యాలయాల నుంచి సమాచారం సేకరించవచ్చునని తెలిపారు. అనంతరం వలంటీర్లు శ్రమదానం చేశారు. ఎన్ఎస్ఎస్ పీఓ జలుమూరు రవిబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

ఆమదాలవలస: పట్టణంలోని బైబుల్ మిషన్ చర్చి ఆధ్వర్యంలో మట్టల ఆదివారం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పట్టణ శివార్లలోని ఓవర్ బ్రిడ్జి నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు ర్యాలీ నిర్వహించారు. చర్చి ఫాస్టర్ ఆనందరావు మాట్లాడుతూ గుడ్ ఫ్రైడేకు ముందు వచ్చే ఆదివారాన్ని మట్టల ఆదివారం అంటారని తెలిపారు. పాస్టర్ ఆర్.శ్యామ్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ప్రసాదాల పంపిణీ షెడ్డు నిర్మాణం



నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఆలయ చైర్మన్ ఈశ్వరరావు

పాతపట్నం: ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు..పాతపట్నం నీలమణిదుర్గ ఆలయంలో భక్తులకు ప్రసాదాల పంపిణీ (వితరణ) కోసం ప్రత్యేకంగా షెడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు ఆలయ చైర్మన్ నూలు ఈశ్వరరావు తెలిపారు. అమ్మవారి ఆలయం అనుకుని ఉన్న స్థలంలో ప్రసాదాల షెడ్డు నిర్మాణ పనులు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మాట్లాడుతూ కొరసవాడ గ్రామానికి చెందిన దేవాంగుల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ వివర్స్ జిల్లా అధ్యక్షుడు మంచు చంద్రయ్య ఆర్థిక సహాయంతో ప్రసాదాల షెడ్డు నిర్మిస్తున్నామని తెలిపారు. ఆలయ అసిస్టెంట్ సుదర్శనరావు, ధర్మకర్త ఎస్.కృష్ణారావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షలంటే భయం వీడాలి

సారవకోట: పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు భయం వీడాలని ఎస్ఐ అప్పారావు సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, సమీకృత వసతి గృహం విద్యార్థులకు పరీక్షలకు ఎలా సిద్ధం కావాలో అవగాహన కల్పించారు. పరీక్ష పేపరును క్షుణ్ణంగా చదివి సమాధానాలు రాయాలన్నారు.